ఓటరు ముసాయిదాపై అభ్యంతరాలు తెలపండి


పెద్దారవీడులో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యనారాయణ

పెద్దారవీడు: ఓటరు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలుంటే సరి చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని వెలిగొండ ప్రాజెక్టు ఎస్‌డీసీ, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంవీ సత్యనారాయణ తెలిపారు. మండలంలో పెద్దారవీడు, దేవరాజుగట్టు, బద్వీడుచెర్లోపల్లి గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. ఓటరు జాబితాలో పేర్లలోని చేర్పులు, మార్పులు, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాల్లో ఏవైనా అభ్యంతరాలుంటే పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండే బీఎల్‌వోలకు తెలియజేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఫారం 6,7,8 అందుబాటులో ఉంటాయని, గ్రామాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలని, విధులకు హాజరుకాని వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదివారం మండలంలో అన్ని గ్రామాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఆయనతో పాటు ఈడీటీ చంద్రశేఖరరావు, సూపర్‌వైజర్, ఆర్‌ఐ జి గోపి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి బాబా జయంతి

● పేదలకు అన్న, వస్త్రదానాలు చేసిన సేవా సమితి సభ్యులు


దుప్పట్లను పంపిణీ చేస్తున్న ఎస్సై మహేష్

పెద్దదోర్నాల: సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలను శనివారం మండలంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సత్యసాయి సత్సంగ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిరంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, తండులార్చన, నారాయణసేవ, నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీశైలం రోడ్డులోని సత్య సాయి సేవా మందిరంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు తంగిరాల రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎస్సై మహేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పేదలకు దుప్పట్లను పంపిణీ, అనంతరం అన్న సంతర్పణ, భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో సత్యసాయి సేవా సమితి సభ్యులు గజవల్లి శేఖర్, మొగిళి గుప్తా, కిశోర్, పుల్లారావు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ


నిత్యావసర వస్తువులతో సంఘ నాయకులు

యర్రగొండపాలెం: రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక సన్‌జో ఆశ్రమంలో ఉన్న మానసిక దివ్యాంగులకు నిత్యావసర వస్తువులు, స్వెటర్లు, మందులు శనివారం పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం కార్తీక వనభోజనాల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు బిజ్జం రమణారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం వద్ద వనభోజనాలు ఏర్పాటు చేశామని, ఈ కార్యక్రమంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతం, శివపార్వతుల కల్యాణోత్సవం, మహిళల కోసం కార్తీక దీపోత్సవం, జమ్మి, ఉసిరి చెట్ల పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సన్‌జో ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సేవా సంఘం నాయకులు ఒంగోలు మూర్తిరెడ్డి, మోర్తాల సుబ్బారెడ్డి, శనగ నారాయణరెడ్డి, బోగోలు వెంకటసుబ్బారెడ్డి, పేరం నాగిరెడ్డి, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నర్రెడ్డి వెంకటరెడ్డి, యర్రా లక్ష్మిరెడ్డి, కేసీహెచ్ ఓబులరెడ్డి, ఆవుల రమణారెడ్డి, ఆవుల పెద్ది చెంచిరెడ్డి, పాలం నంది రెడ్డి, నారు నాసర్‌రెడ్డి, కందుల నారాయణారెడ్డి, కొల్లి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

గ్రాండ్ క్రిస్మస్ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ


గ్రాండ్ క్రిస్మస్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పాస్టర్లు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని జీసస్ హీలింగ్ టెంపుల్‌లో గ్రాండ్ క్రిస్మస్ వాల్ పోస్టర్లను పాస్టర్స్ యూనియన్ నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిసెంబర్ 5వ తేదీ గురువారం సాయంత్రం ఆర్‌సీఎం చర్చి గ్రౌండ్‌లో మండల క్రిస్టియన్ ఇవాంజిలిస్ట్ పాస్టర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు యలకపాటి ఇశ్రాయేల్, ఉపాధ్యక్షుడు బుట్టిపాల్ స్వర్ణన్, సెక్రటరీ సింగా ఏసన్న, ట్రెజరర్ యలకపాటి ప్రేమన్న, జాయింట్ సెక్రటరీ యలకపాటి రంజిత్‌రాజు పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామికి విశేష పూజలు


తిరుమలనాథస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దారవీడు: మండల పరిధి చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి గ్రామం సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత గొంద్రాలికొండ తిరుమలనాథస్వామికి కార్తీక మాసం సందర్భంగా భక్తులు శనివారం విశేష పూజలు చేశారు. అర్చకులు భవానిప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, తదితర పూజలు చేసిన అనంతరం పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. దంపతులు అమ్మవారికి ఎదురుగా ఉన్న శ్రీచక్రం వద్ద కుంకుమార్చన పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని, నైవేద్యంతో పాటు కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

నిరుపేద కుటుంబానికి నిత్యావసర వస్తువుల పంపిణీ


నిత్యావసర వస్తువులు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీకి చెందిన మీనిగ నాగేశ్వరరావు కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబానికి డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు అందజేశారు. శనివారం సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ షెక్షావలి ఆధ్వర్యంలో వారి కుటుంబానికి అవసరమైన బియ్యం, నిత్యావసర సరుకులను యూనియన్ సభ్యులతో కలిసి అందజేశారు. దీంతో పాటు కుటుంబానికి అవసరమైన సహాయాన్ని అందిస్తానన్నారు. కార్యక్రమంలో సేఫ్టీ డ్రైవర్స్ యూనియన్ సభ్యులు దగ్గుల శివకృష్ణారెడ్డి, ఇబ్రహీం, రహీం, రాజు, అనిల్, గాలెయ్య తదితరులు పాల్గొన్నారు.

27న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

దర్శి: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఈనెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరవుతారన్నారు. ఐదు మండలాల్లోని పార్టీ అధ్యక్షులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని శివప్రసాద్‌రెడ్డి కోరారు.

త్రిపురాంతకంలో కాలభైరవ హోమం

త్రిపురాంతకం: త్రిపురాంతకంలోని పార్వతి, త్రిపురాంతకేశ్వరస్వామి దేవస్థానంలో ఉన్న కాలభైరవుని ఆలయంలో కార్తీక మాసం శనివారం ప్రత్యేక పూజలు, హోమాలను వేదపండితులు నిర్వహించారు. గణపతి హోమం, నవగ్రహ హోమం, రుద్రహోమాలను పండితులు మంత్రోచ్ఛరణలతో వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు చేశారు. అనంతరం కూష్మాండ దీపోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచాలి

పుల్లలచెరువు: విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో ఇందిర పేర్కొన్నారు. శనివారం మండలంలోని చాపలమడుగు, పీవీపల్లి లోని జెడ్పీ పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను, విద్యార్థుల వివరాలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. పీవీపల్లి జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న ఎస్‌ఐ సంపత్‌కుమార్

పుల్లలచెరువు: బాల, బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పుల్లలచెరువు ఎస్‌ఐ సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని ముటుకుల సిద్దార్థ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై, సైబర్‌నేరాలు, రహదారి భద్రత పై శనివారం ఎస్‌ఐ అవగాహన కల్పించారు. హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజ్యాంగం పై క్విజ్ పోటీలు

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగం పై క్విజ్ పోటీలు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్‌వీ రమణ, డీబీఆర్‌సీ ఏరియా కోఆర్డినేటర్ జీ నాగమణి, ముండ్లమూరు కోఆర్డినేటర్ తప్పెట డేవిడ్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా కార్యదర్శి


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా కార్యదర్శి

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి కాసు ఆదిలక్ష్మిశనివారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయంలో మెంబర్ షిప్, గ్రంథాలయ సెస్ వసూలుకు చర్యలు తీసుకోవాలని గ్రంథపాలకుడు సుబ్బారెడ్డికి సూచించారు.

విత్తన శుద్ధి తరువాతే విత్తాలి

ముండ్లమూరు (దర్శి): విత్తన శుద్ధి తరువాతే రైతులు పొలంలో విత్తనాలు విత్తుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎమ్‌డీ ఫారుక్ అన్నారు. పోలవరం గ్రామంలో కేవీకే ఆధ్వర్యంలో సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రాలను నిర్వహించి ఎంపిక చేసిన 25 మంది రైతులకు ఎస్ఎమ్ఎస్ శాస్త్రవేత్త తూము వెంకటేశ్వరరెడ్డి చేతుల మీదుగా ఒక్కొక్కరికి 10 కేజీలు చొప్పున మినుముల విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏసయ్య, వీఏఏ ప్రదీప్ రైతులు పాల్గొన్నారు.